

వేసవిలో నిండు కుండలా..

దండేపల్లి: వేసవి కాలం వచ్చిందంటే చాలు మండే ఎండలకు బావులు, బోర్ల లోని నీళ్లు అడుగంటుతాయి. కానీ దండేపల్లి మండలం వెంకటాపూర్ సమీపంలో ఓ వ్యవసాయ బావిలో నిండుగా నీళ్లు కనిపించాయి.



నాసిరకం ఇటుకలతో వాకింగ్ ట్రాక్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో మూడోసారి నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ నాసిరకం ఇటుకలతో నిర్మిస్తున్నట్లు వాకర్లు ఆరోపిస్తున్నారు. ఫీటు నుంచి ఫీటున్నర మట్టిని తొలగించి, నిబంధనల ప్రకారం వేయాలని కోరుతున్నారు.

వికసించిన మే పుష్పం

జన్నారం: ప్రతీ సంవత్సరం మే మాసంలో వికసించే మే పుష్పం మండలకేంద్రానికి చెందిన గుర్రం మోహన్‌రెడ్డి ఇంటిలో విరబూసింది. ప్రతీ సంవత్సరం కేవలం మే మాసంలోనే పూస్తుందని, కొన్ని రోజుల తర్వాత అది రాలిపోతుందని మోహన్‌రెడ్డి తెలిపారు.



క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంపల్లి: బెల్లంపల్లి 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయబోతున్నందునా బుధవారం కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని బెల్లంపల్లి విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ బి.రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ కారణంగా పెద్దనపల్లి, కాల్‌టెక్స్, గాంధీనగర్, గంగారాం నగర్, రాంనగర్, హన్మాన్‌బస్తీ, అశోక్ నగర్, బూడిద గడ్డ బస్తీ, సుభాష్‌నగర్, 65డీప్ ఏరియా, శాంతిఖని, రడగంబాల బస్తీలలో విద్యుత్ సరఫరా నిర్ధేశించిన సమయంలో ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సేఫ్టీ పరికరాలు ఇవ్వాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం చొరువ తీసుకొని కాంట్రాక్టర్ వద్ద నుంచి కార్మికులకు గ్లౌజులు, లాంగ్ షూష్, రెయిన్ కోట్‌లు, తదితర సేఫ్టీ పరికరాలు ఇప్పించాలని కోరారు.

క్షయ నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అరుణశ్రీ

కోటపల్లి: క్షయవ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని డాక్టర్ అరుణశ్రీ అన్నారు. కోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం నిర్వహించిన ఏసీఎఫ్ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. క్షయవ్యాధి గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సులువుగా నివారించవచ్చన్నారు. వ్యాధి సోకిన వారు బలమైన ఆహారం తీసుకుంటూ మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. అనంతరం టీబీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్లు అశోక్, సాయిరెడ్డి, రాజమణిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గాన్ని రూ.200కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదని కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘునందన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లెడ బీసీ వాడలో నీటి గోస



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

వేమనపల్లి: మండలంలోని జిల్లెడ గ్రామపంచాయతీ కేంద్రంలోని బీసీ వాడలో తాగునీటి కోసం గ్రామస్తులు అల్లాడుతున్నారు. మస్కు రాజు ఇంటి వద్ద తాగునీటి బోరు ఉన్నా రెండు సంవత్సరాలుగా భూగర్భనీటి మట్టం లేక అడుగున కృంగిపోయింది. బోరు చెడిపోవడంతో సుమారు 30కుటుంబాలు నీటి కోసం తంటాలు పడుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో బోర్‌వెల్ ఏర్పాటు చేసి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని పేర్కొంటున్నారు.

ఇందన్‌పల్లి రేంజ్‌లో తునికాకు సేకరణ నిషేధం

జన్నారం: టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేజ్ పరిధిలో తునికాకు సేకరణ నిషేధించినట్లు రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తునికాకు కోసం అడవిలోకి ఎవరూ వెళ్లొద్దని సూచించారు. ఎవరైనా వెళితే వన్యప్రాణి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో అక్రమంగా ఇసుక తోడినా, కలప తరలించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వన్య ప్రాణులకు ఇబ్బంది కలిగించకుండా అటవీశాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

ఘనంగా వాసవీమాత జయంతి

జన్నారం: మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి సహిత నాగదేవత దేవాలయంలో బుధవారం వాసవీ మాత జయంతి భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గుండి గణేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, పొనకల్ తాజా మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణ, వర్తక సంఘం అధ్యక్షుడు వొజ్జల వామన్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలోని శ్రీసీతారామ ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యక పరమేశ్వరి జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. వాసవీమాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో అవోపా ఆధ్వర్యంలో వాసవీ జయంతి ఘనంగా నిర్వహించారు. అభిషేకం, అలంకరణ, పారాయణం, కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్ష, కార్యదర్శులు కొత్త కిరణ్‌కుమార్, చింతల శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, ఐక్యవ్యాపార సంఘం అధ్యక్షుడు మైలారపు సుధాకర్, జిల్లా అవోపా అధ్యక్షుడు వొజ్జల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో వాసవీ కన్యకపరమేశ్వరి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు బాలక్రిష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వాసవి కన్యక పరమేశ్వరి జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి అభిషేకం, అర్చన, కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, వాసవి క్లబ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో వైశ్యసంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో మండలంలోని వైశ్యసంఘం మహిళలు పాల్గొన్నారు.



భీమారం: జయంతి వేడుకల్లో మహిళలు



తాండూర్: పూజలు చేస్తున్న భక్తులు



దండేపల్లి: జయంతిలో పాల్గొన్న ఆర్యవైశ్యులు



లక్సెట్టిపేట: పూజలు చేస్తున్న భక్తులు



జన్నారం: పూజలు చేస్తున్న మహిళలు

యుద్ధ ప్రాతిపదికన ధాన్యం సేకరణ

- అదనపు కలెక్టర్ మోతీలాల్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

పాతమంచిర్యాల: జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ఆఖరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 219కొనుగోలు కేంద్రాల ద్వారా 6322మంది రైతుల నుంచి 50,707టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.32.13లక్షలు జమ చేశామన్నారు. నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. రైతులు నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి కనీస మద్దతు ధర పొందాలన్నారు. సన్న రకాలకు రూ.500బోనస్ ఇస్తున్నామన్నారు. ప్రతిరోజు 4–8వేల టన్నుల ధాన్యాన్ని కాంటా వేసి 355లారీల ద్వారా కరీంనగర్‌లోని 58మిల్లులకు తరలిస్తున్నామన్నారు. ఆటోమేటిక్ యంత్రంతో శుద్ధి చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాల్లో ఉన్న టార్పాలిన్లు వినియోగించుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, గోనే సంచులు, టార్పాలిన్లు ఏర్పాటు చేశామన్నారు.

వీడని మిస్సింగ్ మిస్టరీ..

- రూ.47 లక్షలతో ఎనిమిది నెలల క్రితం అదృశ్యం
- ఇప్పటికీ దొరకని కిరణ్‌సింగ్ ఆచూకీ
- గాలిస్తున్న పోలీసులు..
- కనీసం శవమైనా చూపించాలంటున్న తల్లిదండ్రులు



కిరణ్‌సింగ్ ఠాకూర్ (ఫైల్)

మంచిర్యాల క్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన శ్రీ లక్ష్మినారాయణ జువెల్లర్స్‌లో పనిచేసే కిరణ్‌సింగ్ ఠాకూర్ (వాసుదేవ కాలనీ) గత ఎనిమిది నెలలుగా కనిపించకుండా పోయాడు. ఐదేళ్లుగా నమ్మకంగా పనిచేసిన కిరణ్, 2024 అక్టోబర్ 17న చెన్నైకి బంగారు నగల కొనుగోలు కోసం రూ. 47 లక్షల నగదుతో వెళ్లాడు. అయితే, అదే రోజు సాయంత్రం నుండి అతని ఫోన్ స్విచ్‌ఆఫ్ అయింది. తల్లిదండ్రులు బాలాజీ సింగ్, రూపబాయి ఆందోళనతో రోదిస్తున్నారు.

అనుమానాల నడుమ విచారణ..

కిరణ్ మానసిక స్థితి సరిగాలేదని తెలిసినా, జువెల్లరీ యజమాని నరసింహాచారి కుమారుడు సందీప్ అతన్ని ఒంటరిగా పంపినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నరసింహాచారి మాత్రం కిరణ్ డబ్బులతో ఉడాయించాడని, అతని కుటుంబమే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశా డు. దీంతో కిరణ్ తల్లిదండ్రులు, సోదరి భవాని, బాబాయ్ పవన్‌లపై కేసు నమోదైంది. కిరణ్ భార్య శ్వేతేంద్రియా రాణిపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసుల గాలింపు..

మంచిర్యాల డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ, మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించామని, స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కిరణ్ ఫోటోలను ఇంటర్‌స్టేట్ పోలీసులకు పంపి, వెబ్‌సైట్‌లో ఉంచారు. కుటుంబ సభ్యుల సహకారంతో కేసును త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

న్యాయం కోసం ఎదురుచూపు

కిరణ్ ఆచూకీ కోసం తల్లిదండ్రులు కన్నీళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశమై, న్యాయం కోసం ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వినియోగదారుల భద్రతే విద్యుత్ శాఖ లక్ష్యం

చెన్నూర్: వినియోగదారుల భద్రతే విద్యుత్ శాఖ లక్ష్యమని విద్యుత్ ఎస్‌ఈ గంగాధర్ అన్నారు. స్థానిక ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో భద్రతా వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్ వైర్లను వినియోగించాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలు అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఎంఎం కైసర్, ఏడీఈ బాలకృష్ణ, ఏఈలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మనోహర్, భీమయ్య, శంకర్ పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొమ్మెర సబ్‌స్టేషన్ పరిధిలో పోస్టర్ అంటించినట్లు ట్రాన్స్‌కో ఏఈ కేశెట్టి శ్రీనివాస్ తెలిపారు. కరపత్రాలు ప్రజలకు అందజేసి అవగాహన కల్పించారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న విద్యుత్ ఎస్ఈ

విద్యార్థుల చేయూత



బాధిత కుటుంబసభ్యులతో విద్యార్థులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులంతా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి, అవసరమున్న వారికి చేయూత అందిస్తున్నారు. కళాశాలలో చదువుతున్న మూడు సంవత్సరాల ఎంబీబీఎస్ విద్యార్థులు 300మంది నెలకు రూ.100చొప్పున జమచేసి, కళాశాలలో అవసరమున్న విద్యార్థులతో పాటు, సాయం కోసం చూస్తున్న వారికి భరోసాగా నిలుస్తున్నారు. అందులో భాగంగానే బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో పోలియోబారిన పడిన ఒకరికి, కల్వరి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమంలోని వృద్ధుడికి రెండు వీల్‌చైర్లను అందించారు.

చెన్నూర్ బంద్ ప్రశాంతం

చెన్నూర్: పహల్గాంలో హిందూ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ హిందూ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టి చెన్నూర్ బంద్ విజయవంతమైంది. పట్టణంలో వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. బంద్ సందర్భంగా హిందూ ఐక్య సంఘాల నాయకులు కొత్త బస్టాండ్ నుంచి గాంధీచౌక్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. హిందూ సంఘాల బంద్‌కు బీ జేపీ, బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నడిపల్లి లక్ష్మణ్‌రావు, మేకల రామస్వామి, కృష్ణ, మహేశ్, ఏతం శివకృష్ణ, జాడి తిరుపతి, నూక శ్రీనివాస్, లట్టి రాజబాపు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నెన్నెల: మండలంలోని మైలారంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో చిన్నవెంకటాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ బుధవారం ప్రారంభించారు. ఏ–రకానికి 2320, సాధారణ రకానికి 2300లుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని తీసుకొచ్చి, కనీస మద్దతు ధర పొందాలన్నారు. రైతులు వరి ధాన్యాన్ని తేమ శాతం 17శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు హరీష్‌గౌడ్, మల్లాగౌడ్, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి రాజేందర్, ఐకేపీ సీఏ లక్ష్మణ్ ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు మద్దతు

పాతమంచిర్యాల: జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు సంస్థాగత మద్దతు బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ బ్యాంకు మద్దతుతో ఎంఎస్ఎం కింద ప్రభుత్వం అన్ని జిల్లాల్లోని పరిశ్రమల కేంద్రాల్లో ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని, తద్వార మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లభ్యత, పోటీ తత్వాన్ని పెంపొందించనున్నామన్నారు. అర్హత, అనుభవం కలిగిన వ్యక్తుల నుంచి మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌లను ప్రతి జిల్లాకు నియమించడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మేనేజ్‌మెంట్, కామర్స్, ఇంజనీరింగ్ చదివిన గ్రాడ్యుయేట్లు, పోస్ట్‌గాడ్యుయేషన్ చేసిన వారికి పాధాన్యముంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10న జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా పరిశ్రమల కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో www. nimsme.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి

చెన్నూర్: రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ అన్నారు. చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ప్రభుత్వం రోగులకు అమలు చేస్తున్న మెనూను తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీహెచ్‌ఎంవో ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.



సీహెచ్‌సీలో భోజనం పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిలో పనిచేసి అనారోగ్యంతో మృతి చెందిన కల్వల సంపత్ (జనరల్ మజ్దూర్) అనే కార్మికుడి కుటుంబానికి గని ఉద్యోగులు, అధికారులు ఆర్థిక సాయం అందించారు. విరాళాలు సేకరించి బుధవారం గనిపై జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ ఈ.తిరుపతి చేతుల మీదుగా రూ.1,02,500 చెక్కు రూపంలో మృతిని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, ఫిట్ ఇంజనీర్ శ్యాం కుమార్, సీనియర్ పర్సనల్ అధికారి ఎస్.సురేందర్, గుర్తింపు సంఘం నాయకులు సంఘం సదానందం, గొర్రె నరసయ్య, కారుకూరి నగేష్, చిలుక రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న గని ఉద్యోగులు

వేసవి శిక్షణ శిబిరాల సందర్శన

కాసిపేట: మండలంలోని లంబాడితండా ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను జిల్లా విద్యాధికారి యాదయ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి 1 నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఆటలు, పాటలు, చదవడం, రాయడం నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఏం నేర్చుకున్నారు అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 8గంటల నుంచి 10.30వరకు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు రజిత, మధుమాల ఉన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

సంక్షిప్త వార్తలు

కన్నయ్య కుటుంబానికి డీటీడబ్ల్యూ పరామర్శ

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి గ్రామంలో యజమాని వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న పాలేరు నాయిని కన్నయ్య కుటుంబాన్ని డీటీడబ్ల్యూవో జనార్దన్ పరామర్శించారు. కన్నయ్య ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను మృతుడి భార్య స్వరూపను అడిగి తెలుసుకున్నారు.అధికారులకు నివేదిక పంపుతామన్నారు. అక్రమ పట్టా చేయించుకున్న వారిపై చర్యలు తీసుకొని భూమి తిరిగి ఇప్పిస్తామన్నారు. కన్నయ్య కొడుకుకు బెస్ట్ అవెలబుల్ స్కూళ్లలో జాయిన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బాగాల రాజన్న, పున్నంలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన శాఖ అధికారి అశోక్, నాయిని ఎల్లక్క, పోశం, తలండి లచ్చన్న , మొండి పాల్గొన్నారు.

తల్లిదండ్రులను వేధించిన కొడుకు అరెస్ట్

లక్సెటిపేట: తల్లిదండ్రులను వేధించిన కొడుకుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శాంతపూర్‌కు చెందిన గుర్రల శశిధర్‌రెడ్డి విలేకరిని చెప్పుకుంటున్నాడు. తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ.. తల్లిదండ్రులను ఆస్తి కోసం ఇబ్బంది పెడుతున్నాడు. తండ్రి ప్రతాప్‌రెడ్డిపై బుధవారం దాడి చేశాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

చెన్నూర్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, దాసరి రాజేశ్వరి, ఉమారాణి, యామిని, రమాదేవి, నరేశ్, శారద పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలి

రామకృష్ణాపూర్/బెల్లంపల్లిరూరల్: డబుల్ బెడ్ రూం ఇళ్లు అర్హులైన నిరుపేదలకే కేటాయించాలని క్యాతనపల్లిలోని 5వ వార్డు అమరవాది మాజీ కౌన్సిలర్ మహేష్, గ్రామస్తులు బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజుకు, బెల్లంపల్లిలో సీపీఐ నాయకులు ఎంపీడీవో మహేందర్‌కు వినతిపత్రాలు అందజేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.